# తుపాకీ పడవ రాజనీతి

ఊరికో యాహ్యాఖానుంటే యింటికో ఇందిరా గాంధి వుండటం తప్పనిసరి. ఫెమినైన్ పవర్ గురించి త్యాగరాజుకి బాగా తెలుసు గనుకే 'ఎంతవారలైన కాంత దాసులే' అన్నాడు. మిస్టర్ రాందాసు కూడా "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ" ఏదో వేళచూసుకుని అన్నాడు. గనుక మన కాంతదాసులు తెలుసుకోవలసిందోటుంది. మన లేడిస్లో కూడా స్లోగా వెదికితే గడ్డిమేట్సులాటి మగాళ్ళ పక్కన గన్‌బోట్సులాటి ఆడాళ్లున్నారు. అంతెందుకు మా వేలువిడిచిన పెద్దమేనత్తనే తీసుకోండి, ఆవిడ సంసారం ఒక సెవెన్త్ ఫ్లీట్లా వుంటుంది. ఆవిడ మొగుడు పైజమా, సూటూ, బూటూ ఊడదీసి పిలకపెట్టించి గావంచా కట్టిన 'నిక్సన్'లా వుంటాడు.

ఆవిడ బ్రదరొకడున్నాడు. భుటక్కీర్తులా మిలట్రీ దుస్తులు తీసేసి, గూడుబండి క్రాపు చేయించి, రెండెడ్ల బండిమీద చెర్నాకోలు చేతికిచ్చి కూర్చోపెడితే అచ్చం అన్నీ వూడిపోయి సర్వాంగక్షవరమయిన యాహ్యాఖాన్‌లా వుంటాడు. మా మేనత్త ఆడబడుచొకావిడ అచ్చం చెడిపోయిన పాకిస్తాన్ టాంకులా వుంటుంది. మా మేనత్త అత్తగారొకావిడ యింకా బాగానే వుంది. పళ్ళుకదల్లేదు, చేగోడీలు అవీ తింటుంది. ఇంటి దగ్గరున్నప్పుడే ఆవిడకి మడి. నిప్పుల్ని కడుగుతుంది. మళ్ళీ రైల్లో కారప్పూస పునుకులూ అవీ కొనుక్కుని దొంగతనంగా మేస్తుంది. అయితే చూడ్డానికి

మాత్రం ఆవిడ ఖారీశతఘ్నిలా వుంటుంది. మనం వారిని గుర్తించాలే కాని మన చుట్టుపక్కల లేడీస్‌లో కూడా మహా పురుషులున్నారు. యిదివరకీ మాట ఎక్కడో విన్నాను. విన్నానో లేకపోతే నేనే అన్నానో-మామేనత్త గారింట్లో మిస్సైలీబోట్సులాటి కుర్రాళ్లూ హెలికాఫ్టర్లలాటి అమ్మాయిలు వున్నారు పెళ్ళికెదిగి. మా పిన్నిగారి మొగుడు మునిగిపోయిన జలాంతర్గామిలా వుంటాడు. అయితే మా పిన్ని మాత్రం గస్తీనౌకేననుకోండి. అదల్లా కనిపెట్టి తిరుగుతున్నప్పటికీ పేకాట్లో, యాహ్యాఖాన్ తూర్పు పాకిస్థాన్ పోగొట్టుకున్నట్లు యావదాస్తీ పోగొట్టుకున్నాడు. ఇప్పుడాయ



స్థగ్గరేంలేదు. మంచం తిరగేస్తే పడవ. అంతే - మా దొడ్డమ్మ కొడుకు లున్నారు వాళ్ళు జెట్లు. మిగ్గులు నాట్లు, మారుత్లే అనుకోండి. చూసి రమ్మంటే కాల్చొస్తారు. అంతెందుకు మా బ్లిడీ బంధువర్గంలోనే అన్ని రకాల శాస్త్రీలు శాంపిల్సు వున్నాయనుకోండి.

4)

ఈ మగాళ్ళను మనం కాయలేవమండీ అంటూ వచ్చింది మా పొరుగింటి మీనాక్షమ్మ. "అవునమ్మా నువ్వేమన్నా తుపాకీ పడవ్వా కావలా కాయటానికి" అని నేను చెప్పొద్దూ ఎగదోశాను. ఆవిడ బుడిబుడి దీర్ఘాలు తీసింది చీత్తూ, ముక్కు ఎగబీలుస్తూ. వూరుకోవమ్మా అని ఓదార్చి "గన్ బోటు డిప్లమసీ" అవలంభించమని చెప్పాను.

సంసారం సాగరం కదా, సాగరం అంటే సముద్రం కదా! సముద్రంలో మీవార్ని శత్రుస్థావరం అనుకో అన్నాను, అనుకుంటానంది. అప్పుడు నువ్వు మీ వాళ్ళందర్నీ పిలిపించి ఒక సప్తమ నౌకా దళాన్ని తయారుచేసి మీవారికి ఎక్కడ అప్పుపుట్టకుండా చెయ్యి. మీవాళ్ళతని రాకపోకలు, విందులూ, విహారాలు కనిపెడుతూంటారు. అందుమీదట ఎక్కడ చూసినా నీ సప్తమ నౌకాదళం సంసార సముద్రంలో ప్రత్యక్షమయేసరికి నీ నాథుడు చేతులెత్తేసి శరణు శరణు అంటూ వచ్చి నీ కాళ్ళమీద పడతాడు. ఇదే తుపాకీ పడవరాజనీతి పొమ్మన్నాను. నవ్వుకుంటూ పోయింది. మన ఇందిరమ్మ చెప్పినట్లు ఇరుగు పొరుగు దేశాలకి సహాయం పడటం మన కనీస కర్తవ్యం కదా అని నేను సంతృప్తి చెందాను. అసలంతదాకా ఎందుకు? సెవెన్త్ ఫ్లీటు అంటూ కంగారుపడ్డారు కాని—మనం శ్రావణ మంగళవారం పేరంటానికి లేదా సంకురాత్రి బొమ్మల నోములకి బయల్దేరినప్పుడు రోడ్లమీద మన లేడీస్ గుంపులు గుంపులుగా నడుచుకొని వెళ్తొంటే సప్తమ నౌకాదళాన్ని మించిపోయి వుండదూ మన హడావిడి. ప్రతి పండక్కీ మనలేడీస్ అంతకుముందు చిన్నసైజు పడవల్లాగ వయ్యారంగా నడిచి వెళ్ళేవాళ్ళు పేరంటాల్లో నౌకాదళాన్ని మించిపోయినట్లు కనిపిస్తారు. మన పేరంటాలు, వ్రతాలు, పూజలు, ఎట్సెట్రాలన్నీ మగాళ్లను లొంగదీసుకోటానికి గన్ బోటు డిప్లమసీలా వుపయోగపడతాయి. ఇవి పాతవే అనుకోండి. మన ట్రిక్కులు ట్రిక్కులే కదా!

వాళ్ళ సముద్రంలో బల ప్రదర్శన చేస్తే మనం ఆడాళ్ళం సంసారంలోనే బల ప్రదర్శన చేస్తాం. ఆమాటకొస్తే కోటిమంది శరణార్థులొచ్చి మనదేశంలో తిష్టవేశారని పన్నులు పెంచుకున్నాం అవునా ? మన బ్లడీ బంధువర్గంలోనే అని మునిమనవల్తో సహా తరలివచ్చి చుట్టాలిళ్ళపై బడి తినేవాళ్ళెంతమంది లేరూ? పైగా మన ఎగస్పార్టీ బంధువుల్తో చేరి పేచీలు పెట్టేవాళ్ళు కూడా వుంటారు. మన్ని హడలకొట్టి యాగీ చెయ్యటానికి మనవాళ్ళలోనే "జుల్ఫికర్ ఆలీ భుట్టో"లు వుంటారు. ప్రపంచ సంస్థ నోరుమూసుకు పడుకున్నట్లు మనం పెద్దవాళ్ళ మనుకుంటున్న మన వారిలోనే ఏమైంకా టాకుటాకే వాళ్ళున్నారు. నోరున్నవాడిది రాజ్యమై పోయింది.

మనం అహింస అహింస అనకుండా, ఒక చెంప వాయిస్తే శత్రువుకి రెండో చెంప చూపెట్టకుండా. అలీన విధానం బెండకాయ పులుసు అని కూచోకుండా సమయమూ సందర్భమూ తెలుసుకుని రష్యా వాడితో నేస్తంకట్టి ఒట్టేయించుకోబట్టి వీటోమీద వీటో ప్రేలింది. తరువాత పాకిస్తాన్ వాడి వీపు పేలింది. అంచేత కుటుంబంలో కూడా అహింసా విధానం అలీన విధానం అంటూ పనికిరాని పాత నీతులు వల్లిస్తూ కూచోకూడదు. మొగుడు చావచితక కొడుతూంటే పతివ్రతా ధర్మం అని చావు దెబ్బలు తినటం అహింస, తిరగబడి గరిటవిసరటం సాయుధ పోరాటం. అహింస తెలీకే జమ్మిచెట్టుమీంచి ఆయుధాలు దింపారా పాండవులు ? బంగ్లాదేశ్ విముక్తి అహింసాయుతంగా ఎందుకు జరిపించారు కాదు ? రక్తపాతం లేకుండా స్వరాజ్యం సంపాయించినవాళ్ళు త్రివిధ దళాల సహాయంలేకుండా ఢాకాను విడిపించలేకపోయారా?

మన్ని మనం మోసం చేసుకోవచ్చుగాని ఆదర్శాలు వల్లించి చరిత్రను మోసం చేయలేము. యుగధర్మం మారుతూవుంటుంది. లోకంలో

జబర్దస్తీ, దౌర్జన్యం, అన్యాయం మితిమీరినపుడు విల్లంబులు ధరించిన శ్రీరాముడే ప్రజలకు ఆదర్శం కావాలి కాని కొల్లాయి కట్టిన గాంధీ కాదు. బంగ్లాదేశ్‌ను విముక్తం చేయటానికి మనం ఎటువంటి సాహసాలు, త్యాగాలు చేశామో అంతకంటె మించిన త్యాగాలు, సాహసాలు మన ప్రజలు ఆర్థిక బానిసత్వం నుండి విముక్తం చేయటానికై మనం చేయవలసి వుంది. జైల్లో కూర్చొని రాట్నాలు వడకటం వలన హరేరామ హరేకృష్ణ అనటంవలన మన ప్రజలకు నిజమైన విముక్తి లభించదు. దేశంలోని దుష్టశక్తులతో తలపడి పోరాటం సాగిస్తేనే కాని ఒక గొప్ప 'యుద్ధం' ద్వారాకాని మిట్ట పల్లాలు ఏకంకావు. ఎవడో వచ్చి రోడ్డు వేస్తాడు. మనం నడుద్దామని కూర్చుంటే మన చుట్టూ కీకారణ్యం పెరిగి పోయి మనకు భవిష్యత్తు మూసుకుపోతుంది. జైహింద్ !